# సాక్షి మెదక్

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025




సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సూర్య నమస్కారాలు చేస్తున్న యోగ సాధకులు

## న్యూస్‌రీల్

### ఏసయ్యా.. కరుణించు



చర్చిలో ప్రార్థన చేస్తున్న భక్తులు

**మెదక్‌జోన్:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెండు పర్యాయాలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య, మధ్యాహ్నం రిటైర్డ్ ప్రెసిబెటరీ ఇన్‌చార్జి జయరాజ్ భక్తులనుద్దేశించి దైవ సందేశం ఇచ్చారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

### ఉపాధ్యాయుల సమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

**మెదక్ కలెక్టరేట్:** ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలు పెంచడంలో పీఆర్టీయూటీఎస్ ఎంతో కృషి చేసిందని సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూటీఎస్ భవన్ వద్ద ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం వ్యవస్థాపకుడు సామల యాదగిరి చిత్రపటానికి నివాళులర్పించి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూటీఎస్ చేసిన సేవలను వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఘం అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలపై పోరాటం

**నారాయణఖేడ్:** కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఏసురత్నం ఆదివారం సంఘం నాయకులకు సూచించారు. కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని సంఘం జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పోరాటం చేస్తోందని వివరించారు.

# సూర్యనమస్కారాలు 4,02,154

**వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు • పాల్గొన్న 1,484 మంది సాధకులు**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** జిల్లా కేంద్రంలో ఆదివారం సూర్యనమస్కారాలు అట్టహాసంగా జరిగాయి. ఏకంగా 4,02,154 సూర్య నమస్కారాలు చేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో శత సహస్ర సూర్య నమస్కారాలు జరిగాయి. అలాగే రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 20 జిల్లాల నుంచి 1,484 మంది సాధకులు పాల్గొన్నారు. 25 ఏళ్ల లోపు, 25 ఏళ్లు పైబడిన వారికి వేరువేరుగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. పురుషులకు, మహిళలకు వేరువేరుగా పోటీలు జరిగాయి. నాలుగు విభాగాల్లో జరిగిన పోటీల్లో ఐదేళ్ల నుంచి 72 ఏళ్ల వయసు ఉన్న వారు పాల్గొని ఉత్తేజాన్ని నింపారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు, యోగసాధకులకు అతిథులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పోటీలను సిద్దిపేట జిల్లా జాయింట్ కలెక్టర్ గరీమా అగర్వాల్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డిలు లాంఛనంగా ప్రారంభించారు.



వండర్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్ అందిస్తున్న నిర్వాహకులు

### విజేతలు వీరే..

ఈ పోటీలలో మహిళల సీనియర్ విభాగంలో మహబూబ్‌నగర్‌కు చెందిన వనజ (45) 1,100 సూర్యనమస్కారాలు చేసి రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన బొల్లి మల్లేశం(59) 1,152 సూర్యనమస్కారాలు చేసి సీనియర్ పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. మహిళల జూనియర్ విభాగంలో జనగామ జిల్లాకు చెందిన హాసిని (11) 1,232 సూర్యనమస్కారాలతో ప్రథమ స్థానంలో, సిద్దిపేట జిల్లా జక్కాపూర్‌కు చెందిన హరిణి (11) 1,232 సూర్య నమస్కారాలతో ద్వితీయ స్థానంలో నిలిచారు. పురుషుల జూనియర్ విభాగంలో సిద్దిపేటకు చెందిన హరిహర కార్తీక్ (10) 1,456 సూర్యనమస్కారాలు చేసి ప్రథమ స్థానంలో నిలిచారు.

# జలం.. పాతాళం!

- వేగంగా పడిపోతున్న భూగర్భజలాలు
- ఒకే నెలలో మీటర్ లోతులోకి...!
- జిల్లాలో అత్యధికంగా వరి సాగు
- ఎత్తిపోతున్న బోర్లు..

పెరుగుతున్న ఎండలే కారణం



కొల్చారం మండలంలో బోరు నుంచి తక్కువగా వస్తున్న నీరు

**ఎండలు ముదురుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. మరో పక్క భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో జిల్లాలో 9.95 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టం, జనవరి చివరి వారానికి వచ్చే సరికి 10.94 మీటర్లకు పడిపోయాయి. ఈలెక్కన కేవలం నెల వ్యవధిలో 1.01 మీటర్ లోతుకు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది.**

**మెదక్‌జోన్:** జిల్లాలో చెప్పుకోదగిన సాగు నీటి ప్రాజెక్టులు లేవు. ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు ఘనపూర్ ఉంది. సంగారెడ్డి జిల్లాలోని సింగూర్ ప్రాజెక్టు నుంచి మూడు, నాలుగు విడతలుగా నీటిని వదిలితేనే దాని ఆయకట్టు పరిధిలోని 25 వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి. అయితే జిల్లాలో 95 శాతం మంది రైతులు బోరుబావుల ఆధారంగానే వ్యవసాయం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 1.20 లక్షల బోరుబావులు ఉండగా.. వీటి పరిధిలో 2.90 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు 2.50 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తికాగా, ఈ నెలాఖరుకు మరో 40 వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. కాగా కరెంట్ ఉన్నంత సేపు బోరు మోటార్లు నడుస్తూనే ఉంటాయి. భూమిలో ఉన్న చుక్కచుక్కను ఎత్తి పోస్తాయి. దీంతో రానున్న రోజుల్లో మరింత వేగంగా భూగర్భజలాలు పడిపోయే ప్రమాదం ఉంది.

### నీటిని పొదుపుగా వాడుకోవాలి

జిల్లాలో గత డిసెంబర్ నుంచి జనవరి మాసానికి వచ్చే సరికి మీటర్ లోతులోకి భూగర్భజలాలు పడిపోయాయి. ఎండలు ముదిరితే మరింతగా పడిపోయే ప్రమాదం ఉంది. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి. అవసరం మేరకే వినియోగించుకోవాలి. అలాగే గ్రామాల్లో పంపుసెట్లు నిరంతరం నడుస్తూనే ఉంటాయి. దీంతో నీరు వృథా అయ్యే అవకాశం ఉంటుంది. అలా కాకుండా పర్యవేక్షించాలి.

**- లావణ్య, గ్రౌండ్ వాటర్ ఫీల్డ్ ఆఫీసర్**

### అట్టడుగున కొల్చారం..

ప్రస్తుతం జిల్లాలో 10.94 మీటర్లు లోతులోకి నీటి మట్టం పడిపోగా.. కొల్చారం మండలంలో మాత్రం 19.64 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఇందుకు ప్రధాన కారణం అత్యధికంగా బోరుబావులు ఉండటం, చెరువులు కుంటలు చెప్పుకోదగ్గ లేకపోవటమేనని తెలుస్తోంది. ఏటా కొల్చారం మండలంలో భూగర్భజలాలు వేగంగా పడిపోతుంటాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

### పిల్లికొటాల్‌లో పైపైనే..

జిల్లా కేంద్రాన్ని ఆనుకొని ఉన్న పిల్లికొటాల్ సమీపంలో కేవలం 3.67 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. ఇందుకు కారణం ఎంఎన్ కెనాల్ ప్రవహించటం, గ్రామానికి అతి సమీపంలో బొల్లారం మత్తడి ఉండటమే కారణం. రెండో స్థానంలో హవేళిఘనాపూర్‌లో 4.12 మీటర్లు, మూడో స్థానంలో వెల్దుర్తి మండలం కుకునూర్‌లో 5.67 మీటర్లలోతులో భూగర్భజలాలు ఉన్నాయి.

# ఢిల్లీ ప్రజలు ధర్మానికి పట్టం కట్టారు

**మెదక్ ఎంపీ రఘునందన్‌రావు**

**మెదక్‌జోన్:** మూడు దశాబ్దాల తర్వాత ఢిల్లీ ప్రజలు ధర్మానికి పట్టం కట్టారని మెదక్ ఎంపీ రఘునందర్ రావు అన్నారు. ఆదివారం ఆయన మెదక్‌లో విలేకరులతో మాట్లాడారు.. అక్రమ లిక్కర్ వ్యాపారంలో ఎమ్మెల్సీ కవిత, కేజ్రీవాల్ చేసిన అవినీతి అంతా ఇంతా కాదన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమికి సైతం అవినీతే కారణమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మొదలుకుని అన్నింట్లో అవినీతికి పాల్పడి రూ. లక్షల కోట్లు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. ఇక ఢిల్లీలో కాంగ్రెస్‌కు మిగిలింది గాడిద గుడ్డేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 8 వేల మంది ఉద్యోగులు రిటైర్మెంట్ అయితే వారికి రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వలేదని మండిపడ్డారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం లాంటి ఎన్నో గొప్ప పనులు చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అంజిరెడ్డిని గెలిపించుకోవాలని, ఇందుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువత బీజేపీ వైపే ఉందని.. ప్రతి గ్రాడ్యుయేట్‌ను కలిసి ఓటు అడగాల్సి బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, నాయకులు శ్రీనివాస్, ప్రసాద్, ఎంఎల్ఎస్ రెడ్డి, విజయ్‌కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

# విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

**డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్**

**నర్సాపూర్:** విద్య, వైద్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎం కప్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో ఓడినా వారు నిరుత్సాహ పడవద్దన్నారు. టోర్నమెంట్‌లో సంగారెడ్డికి చెందిన ఎంఎస్ అకాడమి జట్టు ప్రథమ స్థానంలో నిలువగా.. నర్సాపూర్‌కు చెందిన సర్కిల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరికి బహుమతులు అందజేశారు. అనంతరం ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాల, కాలేజీ అడ్మిషన్లకు సంబంధించిన బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ నసీమా షేక్‌తో కలిసి ఆవిష్కరించారు.



గెలుపొందిన జట్టుకు జ్ఞాపిక, చెక్కును అందజేస్తున్న నాయకులు

# దుర్గమ్మా.. చల్లంగా చూడమ్మా





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు. (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

ఏడుపాయల పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు వన దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఒడి బియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో భక్తుల కొంత ఇబ్బంది పడ్డారు. ఈఓ చంద్రశేఖర్, పోలీసులు పర్యవేక్షించారు.

– పాపన్నపేట(మెదక్)

# వడివడిగా అడుగులు

- ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు
- మాసాయిపేట మండలంలో 578 ఎకరాల కేటాయింపు
- భూ సేకరణపై విచారణ ప్రారంభం



ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు కేటాయించిన భూమి ఇదే..

**వెల్దుర్తి(తూప్రాన్):** ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం భూ సేకరణకు సంబంధించి అధికారులు విచారణ ప్రారంభించారు. జాతీయ రహదారి 44, మాసాయిపేట మండల కేంద్రానికి సమీపంలోని అచ్చంపేట, హకింపేట, రామంతాపూర్ పరిధిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం కోసం టీజీఐఐసీ జోనల్ మేనేజర్ 979.11 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆదేశం మేరకు మాసాయిపేట మండలం అచ్చంపేట శివారులోని సర్వే నంబర్లు 61 నుంచి 86 వరకు, మరియు 115, 122, 130, 131, 132లలో 416.20 ఎకరాలు, హకింపేట పరిధిలోని 12, 17, 19, 20, 95, 194, 93, 97, 112 సర్వే నంబర్లలో 162.14 ఎకరాలు కలిపి మొత్తం 578.34 ఎకరాల సీలింగ్ భూములను రెవెన్యూ అధికారులు గుర్తించారు.

### భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం

మండలంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం రెవెన్యూ అధికారులు భూ సేకరణ ప్రక్రియ ప్రారంభించారు. అచ్చంపేట పరిధిలో గుర్తించిన 416.20 ఎకరాల్లో అదే గ్రామానికి చెందిన సుమారు 200 మంది, చిన్నశంకరంపేట మండలం ధర్పల్లికి చెందిన సుమారు 42 మంది, హకింపేట పరిధిలో 162.14 ఎకరాల్లో హకింపేటతో పాటు అచ్చంపేటకు చెందిన 87 మంది రైతులు భూములు కోల్పోనున్నారు. ఆయా భూముల్లో బోర్లు, ఇతర నిర్మాణాలు ఏమైనా ఉన్నాయా..? ఉంటే వాటి విలువ ఎంత మేరకు ఉంటుంది అని మరో రెండు మూడు రోజుల్లో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపనున్నారు. పూర్తి వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తారు. ప్రభుత్వం బాధిత రైతులందరికీ నష్ట పరిహారం చెల్లించిన అనంతరం పార్కు పనులు ప్రారంభం కానున్నాయి. కాగా అచ్చంపేట పరిధిలో 1990లో సీలింగ్ పట్టాలు పొందిన 242 మంది రైతుల్లో సుమారు 50 మందికి సంబంధించిన భూముల వివరాలు రికార్డులో నమోదు కాలేదని అధికారులు గుర్తించారు. అదేవిధంగా సుమారు 70 మంది రైతుల వివరాల్లో తేడాలు ఉన్నట్లు గమనించారు. అందులో భాగంగానే ఇటీవల అచ్చంపేట శివారులోని 70 మంది రైతుల రికార్డుల తొలగింపు, విస్తీర్ణం సవరణ వంటి వాటికి సంబంధించి నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న వారిలో ఏమైనా అభ్యంతరాలుంటే సరైన పత్రాలతో శనివారం సాయంత్రం లోపు మాసాయిపేట రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించాలని తహసీల్దార్ జ్ఞానజ్యోతి సూచించారు. ఇదిలా ఉండగా వ్యవసాయం పైనే ఆధారపడి సాగు చేసుకుంటున్న భూములకు ఇండస్ట్రియల్ పార్కు నుంచి మినహాయింపు ఇస్తే బాగుంటుందని పలువురు రైతులు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### గ్రామాలలో పశువుల దొంగల హల్‌చల్

**ఒకే రోజు రెండు ఊర్లలో అపహరణ**

**మర్కూక్(గజ్వేల్):** గ్రామాలలో పశువుల దొంగల హల్‌చల్ చేస్తున్నారు. రైతుల పొలాల వద్ద పాకలో కట్టేసి ఉంచిన పశువులను టార్గెట్ చేస్తున్నారు. మూడు కాడెద్దులు, ఒక దూడ, ఒక గేదెను అపహరించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని నర్సన్నపేటకు చెందిన కానిగంటి రాజిరెడ్డి రోజులాగానే తన ఎద్దు, దూడ, గేదెను మేతకు తీసుకెళ్లి శుక్రవారం రాత్రి తన భావి వద్ద పశువుల పాకలో కట్టేశాడు. తెల్లవారు జామున వెళ్లి చూసే సరికి కనిపించలేదు. అర్ధరాత్రి తర్వాత వాటిని దుండగులు వాహనాలలో ఎక్కించుకెళ్లారని, వాటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని రైతు వాపోయాడు. అలాగే చేబర్తి గ్రామానికి చెందిన గ్యార శ్రీశైలానికి చెందిన రెండు ఎద్దులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని, వాటి విలువ రూ.లక్ష యాభై వేలు ఉంటుందని రైతులు తెలిపారు. మర్కూక్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశామని వారు చెప్పారు.

### చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

**కోహెడ(హుస్నాబాద్):** ఓ భవనంపై నుంచి ప్రమాదవశాత్తూ కిందపడిన ఓ భవన నిర్మాణ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. గత 5న కోహెడ కొత్త బస్టాండ్ ఆవరణలో ఉన్న ఓ నూతన భవనంపై గజ్జెల ఎల్లయ్య పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. మృతుడి కొడుకు ప్రవీణ్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు.

### మతిస్థిమితం లేని వృద్ధురాలు మృతి


వృద్ధురాలి మృతదేహం

**పాపన్నపేట(మెదక్):** మతిస్థిమితం లేని మహిళ మృతిచెందిన సంఘటన శనివారం ఏడుపాయల్లో చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం. నల్గొండ జిల్లా అడవిదేవునిపల్లికి చెందిన లక్ష్మీ కోటీశ్వరి (74)కి ఇద్దరు కొడుకులు. భర్త ఏడేళ్ల క్రితం చనిపోగా.. అప్పటి నుంచి మనోవేదనకు గురైంది. మానసిన ప్రశాంతత కోసం తరచూ దేవాలయాలకు వెళ్లేది. ఈ క్రమంలో మాఘ అమావాస్య రోజున ఏడుపాయలకు వచ్చి ఇక్కడే ఉంది. శనివారం రాత్రి స్థానిక కబేలా వద్ద పడుకుని నిద్రలోనే చనిపోయింది. ఆమె పక్కన పడుకున్న జోగిపేట వాసులకు అనుమానం వచ్చి, ఆలయ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

# నా చావుకైనా వస్తావా బిడ్డా..

'తండ్రి చివరి చూపు చూసేందుకు రాలేదు.. తన చావుకైనా వస్తుందో రాదో, ఎక్కడ ఎదురు కాల్పులు జరిగినా తల్లడిల్లిపోతున్నా.. నా బిడ్డ ఎక్కడ ఉందో ఏమో.. లొంగిపోయి ఇంటికి రా బిడ్డా..' అంటూ మావోయిస్టు భాగ్య తల్లి రంగబోయిన ఎల్లవ్వ బోరున విలపిస్తోంది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన రంగ బోయిన నర్సయ్య, ఎల్లవ్వ దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురు భాగ్య అలియాస్ కల్పన అలియాస్ మాధవి అలియాస్ రూపీ 24 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో కీలకంగా పని చేస్తున్నారని సమాచారం. ఇటీవల పలు ఎన్‌కౌంటర్లలో మావోయిస్టులు మృతి చెందుతున్న నేపథ్యంలో భాగ్య తల్లి ఎల్లవ్వను 'సాక్షి'పలకరించగా బోరున విలపించింది. ఆవేదన ఆమె మాటల్లోనే...

**ఏళ్లుగా ఎల్లవ్వ ఎదురుచూపులు**
**24 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి భాగ్య అలియాస్ కల్పన**
**కన్నపేగు కోసం తల్లడిల్లుతున్న వృద్ధురాలు**


భాగ్య అలియాస్ కల్పన (ఫైల్)

**సాక్షి, సిద్దిపేట:** భాగ్య పోలియోతో పుట్టింది. రెండు కాళ్ల వంకరగా ఉన్నాయి. ఎన్నో ఆస్పత్రులు తిరిగాం. చిన్నప్పుడే ఆపరేషన్ చేయించాలని, ముంబాయిలో చేస్తారని డాక్టర్లు చెప్పడంతో అక్కడికి వెళ్లాం. అక్కడ రోజుకు రూ. 15 కూలీ పనులు చేసుకుంటూ మహాలక్ష్మి ఆస్పత్రిలో చూపించాం. కాళ్లకు ఆపరేషన్ చేసి సక్కగా చేశారు. చదువుకోలేదు కానీ బీడీలు చేయడం నేర్చుకుంది. ఈడొచ్చిన తర్వాత పెళ్లి చేస్తామంటే 'నన్నెవరు పెళ్లి చేసుకుంటారు? నా కాళ్లకు ఆపరేషనైంది కదా, ఇట్లనే ఉంటా'అని బదులిచ్చేదని తల్లి ఎల్లవ్వ గుర్తు చేసుకుంటోంది.


కూతురుకోసం రోదిస్తున్న ఎల్లవ్వ

### గుండె తరుక్కుపోతోంది..

నా బిడ్డకు పెళ్లై అత్తగారి ఇంటికి పోయి ఉంటే.. ప్రతి పండుగకు వచ్చేది. 24 ఏళ్ల నుంచి కంటికి కనబడతలేదు. బిడ్డను చూడాలనిపించినా.. ఎక్కడ అని వెతకాలే.. ఏ అడవిలో వెతకాలి?. నా బిడ్డ ముఖం చూసి గుర్తుపట్టే స్థితిలో లేను. కాళ్లకు ఆపరేషన్ జరిగింది కనుక కాళ్లను చూసి గుర్తు పడతాను. కాల్పుల్లో నక్సలైట్లు చనిపోయారు అనే వార్తను టీవీల్లో చూస్తే గుండె తరుక్కుపోతోంది.

### అప్పుడే అడవిలోకి అడుగులు..

వినాయక చవితి సందర్భంగా ఆ రోజు ఇంట్లో అక్కాచెల్లెల్లు గొడవ పడ్డారు. తెల్లారి ఉదయం రోజు మాదిరిగానే తయారు చేసిన బీడీలను గంపలో వేసుకుని అప్పగించేందుకు వెళ్లింది. అప్పుడు గడప దాటి పోయిన బిడ్డ మళ్లీ కంటికి కానరాలేదు. ఆ రోజు సాయంత్రం వరకు చూశాం రాలేదు. ఎటు పోయిందో ఏమో అని చిట్టాపూర్, చింతమడక, ధర్మాజీపేట, బండారుపల్లి చుట్టాలు, తెలిసిన వారి ఇంటికి వెళ్లి ఆరా తీసిన ఆచూకి లభించలేదు. వారం రోజుల తర్వాత పోలీసులు ఇంటికి వచ్చారు. మీ బిడ్డ నక్సలైట్లలోకి పోయిందని చెప్పారు. పదేళ్ల వరకు దుబ్బాక, మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరిగాం. ఆపరేషనైన కాళ్లతోని బిడ్డ అడవుల్లో ఎట్ల తిరుగుతుందో ఏమో అని మధనపడని రోజు లేదు.

### లొంగిపోయి ఇంటికి రా బిడ్డా..

వాళ్ల బాపమ్మ అంటే భాగ్యకు ఎంతో ఇష్టం. తాను పదేళ్ల క్రితం చనిపోయింది అప్పుడు చూడటానికి రాలేదు. ఐదేళ్ల క్రితం నా భర్త (భాగ్య నాన్న) నర్సయ్య అనారోగ్యంతో చనిపోయాడు. తండ్రిని ఆఖరి చూపు చూసేందుకు వస్తుందో అని చూశాం. కానీ, రాలేదు. నాకు వయసు మీద పడుతుంది. నడుం సరిగా నిలబడుతలేదు. ఆరోగ్యం మంచిగా ఉండటం లేదు. నా చావుకైనా వస్తుందో రాదో. లొంగిపోయి ఇంటికి రా బిడ్డా. నిన్ను ఏ కష్టం లేకుండా చూసుకుంటాం. మన కుటుంబంలో కలువు బిడ్డా అంటూ తల్లి రోదించింది.. ఇప్పుడు ఉన్న ఇల్లు కూలిపోతోంది. ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకోవాలి అంటూ వేడుకుంది.


ఎల్లవ్వ ఉండే ఇల్లు ఇదే..

# గుర్తు తెలియని వాహనం ఢీ..

**యువకుడి దుర్మరణం**


మృతుడు రహీమ్(ఫైల్)

**హవేళిఘణాపూర్(మెదక్):** గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని హవేళిఘణాపూర్ శివారులో శనివారం అర్ధరాత్రి రాత్రి చోటు చేసుకుంది. మెదక్ పట్టణం ఫతేనగర్‌కు చెందిన యువకుడు రహీం (23) తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందగా.. చిన్నాన్న సలామ్ వద్ద ఉంటూ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి దాబాకు వెళ్లి భోజనం చేసి వస్తానని ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లాడు. ఈక్రమంలో స్కూటీపై హవేళిఘణాపూర్ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన భారీ వాహనం అతడిని ఢీకొట్టింది. సుమారు 50 మీటర్ల మేర ఈడ్చుకెళ్లడంతో అవయవాలు చెల్లాచెదురుగా పడ్డాయి. స్కూటీ నుజ్జునుజ్జయ్యింది. మృతుడి జేబులో ఉన్న గుర్తింపు కార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహానికి వైద్యులు సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఢీకొన్న వాహనంపై విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

**కారు, ఆటో ఢీ**

**అక్కన్నపేట(హుస్నాబాద్):** రెండు వాహనాలు ఢీకొన్న సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామవరం గ్రామంలోని మల్లన్న గుడి సమీపంలో కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ఉన్న తిరుపతిరెడ్డికి, ఆటోలో ఉన్న శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్ సహాయంతో హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**రోడ్డు ప్రమాదంలో గాయాలు**

**చిన్నశంకరంపేట(మెదక్):** నార్సింగి మండలం జప్తిశివనూర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. రామాయంపేట నుంచి జప్తిశివనూర్ వైపు వెళ్తున్న బైక్‌ను వెనుకనుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈప్రమాదంలో గ్రామానికి చెందిన బాల మల్లయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### కుంభమేళా వెళ్తుండగా కారు బోల్తా

– ఇద్దరికి గాయాలు

**రామాయంపేట(మెదక్):** రామాయంపేట వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి కారు బోల్తాపడ్డ సంఘటనలో కుంభమేళా వెళ్తున్న ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఐదుగురు స్నేహితులు బెంగుళూరు నుంచి కారులో కుంభమేళా వెళ్తుండగా, ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మైసూర్‌కు చెందిన హేమంత్, సంపత్ గాయపడ్డారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

**చెట్టుకు బైక్ ఢీకొని..**


గాయపడిన వెంకటచారి

**దుబ్బాకరూరల్:** చెట్టుకు బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పోతారం వద్ద ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. గంభీర్‌పూర్‌కు చెందిన వెంకటచారి బైక్‌పై దుబ్బాకకు వస్తుండగా పోతారం వద్ద చెట్టుకు ఢీకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అతనిని 108లో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్, రిమాండ్

**సంగారెడ్డి క్రైమ్:** జైలుకెళ్లి వచ్చినా పద్ధతి మార్చుకోకుండా మళ్లీ చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను సంగారెడ్డి పట్టణ పోలీసులు పట్టుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు. సంగారెడ్డి పట్టణ సిఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన కైసర్‌పాషా తన కుటుంబ సభ్యులతో కలసి గత నెల 31న హైదరాబాద్‌లోని వాళ్ల బంధువుల ఇంట్లో ఓ వేడుకకు వెళ్లాడు. తిరిగి మరుసటి రోజు వచ్చే సరికి పాషా ఇంట్లో వస్తువులు చోరీ అయినట్లు గుర్తించాడు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాషా ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల సాయంతో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి హనుమాన్‌నగర్‌కు చెందిన మహమ్మద్ రఫీక్‌గా గుర్తించి పట్టుకున్నారు. ఇతడిపై గతంలో పలు దొంగతనాల కేసులలో అరెస్టై జైలుకు వెళ్లి 2022లో తిరిగి వచ్చినట్లు గుర్తించారు. దీంతో మరోసారి రఫీక్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

### పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ.4.07 లక్షల నగదు, కారు, బైకు, 15సెల్‌ఫోన్స్ స్వాధీనం
- ఆరుగురు అరెస్ట్, కేసు నమోదు

**వట్‌పల్లి (అందోల్):** పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి 16 మందిని అరెస్ట్ చేసిన సంఘటన శనివారం అర్ధరాత్రి మండలంలోని మర్వెల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరువు, బండ్లగూడ, న్యాల్‌కల్ ప్రాంతాలకు చెందిన 16 మంది గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. రూ.4.07 లక్షల నగదు, 15 సెల్‌ఫోన్స్, 104 పేకాట కార్డ్స్, కారు, బుల్లెట్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఈ తరహా పేకాట జోరుగా సాగుతోంది. హైదరాబాద్ నుంచి వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కోరోజు ఒక్కో చోట పేకాట ఆడుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# గోవర్ధనగిరి దుర్ఘటనపై నిజనిర్ధారణ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మానవ హక్కుల వేదిక సభ్యులు

**అక్కన్నపేట(హుస్నాబాద్):** ఉపాధి హామీ పనులు చేస్తుండంగా బండరాళ్లు మీద పడి తల్లీకూతురు మృతి చెందడం వెనుక భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, అసమర్థ నిర్వహణే కారణమని మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ కమిటీ పరిశీలనలో తేలిందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిళ్ల రంజిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం వారు గోవర్ధనగిరిలో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధ్యులు, కూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదుచేసి, మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలంలోని చౌటపల్లిలో నిర్మించనున్న ఇండస్ట్రియల్ పార్కు కోసం భూసేకరణను రైతులు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. వందలాది రైతుల జీవనాధారమైన భూములను బలవతంగా సేకరించడం ప్రజావ్యతిరేక చర్య అని మండిపడ్డారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొమురయ్య, సంపత్ కుమార్, సదానందం, అచ్యుత్, రాజేందర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలపై ప్రత్యేక దృష్టి


రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించిన పీఆర్టీయూ నాయకులు

**ఘనంగా పీఆర్టీయూ ఆవిర్భావ వేడుకలు**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తోందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ తెలిపారు. పీఆర్టీయూ 54వ ఆవిర్భావ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముందుగా పీఆర్టీయూ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యక్తుల కంటే సంఘం గొప్పదన్నారు. ఉపాధ్యాయ, ఆధ్యాపక సంఘాలు బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు. వంగ మహేందర్‌రెడ్డి ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో ఎంతో కృషి చేశారన్నారు. వీఎంఆర్ ఫౌండేషన్ ద్వారా వేలాది పాఠశాలలకు మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, సంబంధించిన ఎన్నో సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, సుజాత, శ్రీనివాస్, లక్ష్మణ్, అనిల్ కుమార్, రమాదేవి, అనిత, రామచంద్రారెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రార్థసారథి, వెంకటేష్, భద్రం, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత..

**రామచంద్రాపురం (పటాన్ చెరు):** హైదరాబాద్ నుంచి ముంబైకి తరలిస్తున్న 24 టన్నుల రేషన్ బియ్యాన్ని ఆదివారం కొల్లూర్ రింగ్ రోడ్డు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రాజీవ్ చౌవాన్ హైదరాబాద్‌లోని పలుచోట్ల నుంచి రేషన్ బియ్యం సేకరించాడు. ఆ బియ్యాన్ని లారీ ద్వారా ముంబైకి తరలిస్తుండగా పోలీసులు కొల్లూరు రింగ్ రోడ్డు వద్ద లారీని అదుపులోని తీసుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకొని.. లారీని సీజ్ చేశారు.

# కుటుంబ కలహాలతో ఇద్దరి ఆత్మహత్య


నర్సింలు(ఫైల్)

**శివ్వంపేట(నర్సాపూర్):** కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా చిగురుప్ప గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మధుముల నర్సింలు (38) శనివారం చిన్నగొట్టిముక్లలో నివాసం ఉంటున్న తన అన్న ఆంజనేయులు వద్దకు వచ్చాడు. ఆదివారం ఉదయం బయటకు వెళ్తున్నానని చెప్పి గ్రామ శివారులోని బయన్న చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకొన్నాడు. గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

**తొనిగండ్లలో మరొకరు..**


సిద్దాగౌడ్ (ఫైల్)

**రామాయంపేట(మెదక్):** కుటుంబ కలహాలతో మండలంలోని తొనిగండ్లకు చెందిన వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిద్దాగౌడ్ (35) కొంతకాలంగా కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. అతడి భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. గ్రామంలో ఒంటరిగా ఉన్న సిద్దాగౌడ్ శనివారం క్రిమి సంహారక మందు తాగాడు. అతడిని చికిత్స నిమిత్తం రామాయంపేట ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కామారెడ్డికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అయ్యో పాపం అనిరుధ్..

- విద్యుదాఘాతానికి చిన్నారి బలి
- మేనమామ నిశ్చితార్థ వేడుకల్లో విషాదం


అనిరుధ్ (ఫైల్)

**పాపన్నపేట(మెదక్):** మేనమామ వివాహ నిశ్చితార్థ వేడుకలకు వచ్చిన చిన్నారి విద్యుదాఘాతానికి బలి అయ్యాడు. డీజే సౌండ్ కోసం అమరుస్తున్న కరెంట్ తీగలు అబ్బాయి పాలిట కాలనాగులయ్యాయి. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ధంజ్యాతండాలో ఆదివారం రాత్రి జరిగిన విషాదకర సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని డాక్యా తండాకు చెందిన కిషన్‌కు ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. రెండో కూతురు శానుబాయిని మండల పరిధిలోని నర్సింగరావుపల్లి తండాకు చెందిన లక్ష్మణ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి అనిరుధ్(5), శ్రీనాథ్ ఇద్దరు కుమారులు ఉన్నారు. అనిరుధ్ యూకేజీ చదువుతున్నాడు. బతుకుదెరువు కోసం కుటుంబంతో కలసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. లక్ష్మణ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తన బావమరిది గణేష్ నిశ్చితార్థం ఉండడంతో కుటుంబంతో కలిసి ధంజ్యాతండాకు వచ్చారు. ఈక్రమంలో డీజే సౌండ్ కోసం అమరుస్తున్న కరెంట్ తీగలపై అనిరుధ్ పొరపాటున కాలు పెట్టి విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడిని మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో నిశ్చితార్థ వేడుక ఆగిపోగా.. బంధుమిత్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఇదే విషయమై పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను వివరణ కోరగా సంఘటన వాస్తవమేనని, ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని చెప్పారు.

# వైభవంగా పశువుల జాతర

**పశువులతో కిక్కిరిసిన దర్గా ప్రాంతం**

**న్యాల్‌కల్(జహీరాబాద్):** న్యాల్‌కల్ గ్రామ శివారులోని ఉర్సే షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ దర్గా ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మూడవ రోజు ఆదివారం ఉదయం హద్నూర్ గ్రామం నుంచి దర్గా వరకు గంధంను బాజా భజంత్రీలతో తీసువచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్యంగా పశువుల సంత భారీగా జరుగుతుండడంతో రైతులు, వ్యాపారులు, పశుపోషణదారులు, కొనుగోలుదారులు, సందర్శకులతో కిక్కిరిసిపోయింది. పశువుల క్రయ, విక్రయాలు జోరుగా సాగాయి. ఉత్సవాలకు దియోనీ, జెర్సీ, ఒంగోలు తదితర జాతులకు చెందిన పశువులు వచ్చాయి.న్యాల్‌కల్‌కు చెందిన స్వర్గీయ అడివప్ప–గిరిజాబాయి, వారి మనుమడు సురేష్ స్మారకార్థం వారి కుమారుడు ప్రముఖ కళాకారుడు హోతి బస్వరాజ్ తన సొంత డబ్బులు వెచ్చించి మేలు రకం పశువులకు ప్రోత్సాహకాలు ప్రకటించారు.

**పశువుల సంతతో సందడి**

జాతరలో జరిగిన పశువుల సంతలో ఎడ్ల అమ్మకాలు జరిగాయి.. ఏటిగడ్డ ఎల్గోయి గ్రామానికి చెందిన వెంకట్‌రావు జత ఎడ్లను రూ.3.00లక్షలు చెప్పగా, రూ.2.50లక్షలకు రాయికోడ్ మండలంలోని నాగ్వార్ గ్రామానికి చెందిన సమీర్ కొనుగోలు చేశారు. ప్రతి ఏటా జాతర ఉత్సవాల్లో పశువుల సంత నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.


సంతలో పశువులు


బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీ, తదితరులు

**పశుపోషణదారులకు బహుమతులు**

నానాటికి తగ్గిపోతున్న పశు సంపదను పెంపొందించేందుకు ఉద్దేశించిన కార్యక్రమాన్ని ప్రముఖ కళాకారుడు హోతి బస్వరాజు ప్రతి ఏటా నిర్వహిస్తున్నాడు. ఆదివారం నిర్వహించిన జాతరకు జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ శెట్కార్ ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ పశుపోషణదారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ తనీర్, తిరుపతిరెడ్డి, చంద్రప్ప, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గౌసోద్దీన్ సభ్యులు పాల్గొన్నారు.